ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించాలి

కలెక్టరేట్‌కు 59, జీహెచ్‌ఎంసీకి 164 ఫిర్యాదులు

అధికారులకు పలు సూచనలు చేసిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలను వేగంగా పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 59 ఆర్జీలకు గాను 2 4గృహ నిర్మాణ శాఖ, 35 ఇతర శాఖలకు చెందిన ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటా చారి, ఆర్డీవోలు సూర్యప్రకాశ్, రవికుమార్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో..

జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం ప్రజావాణి ద్వారా 164 ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. చార్మినార్ జోన్‌లో 8, సికింద్రాబాద్ జోన్‌లో 13, కూకట్‌పల్లి జోన్‌లో 29, శేరిలింగంపల్లి జోన్‌లో 12, ఖైరతాబాద్ జోన్‌లో ఒకటి వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అడ్మిన్ సరోజ, యాదగిరిరావు, సీఈ దేవానంద్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, హెచ్ ఓడీలు డాక్టర్ పద్మజ, డాక్టర్ రాంబాబు, హౌసింగ్ ఎస్ఈ విద్యాసాగర్, ఓఎస్డీ అనురాధ, ఏఎంసీ శారద తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా

పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ (నాన్ సీబీసీఎస్), బీఈ (సీబీసీఎస్) బ్యాక్‌లాగ్, బీఈ (ఏఐసీటీఈ) మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

- ఎంబీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 16 వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 20 వరకు చెల్లించ వచ్చన్నారు.
- పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫీజును ఈ నెల 19 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. వచ్చే నెలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
- ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ కోర్సు ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని.., ఫలితాలపై అనుమానం ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10వేలు చొప్పున చెల్లించి, ఈ నెల 29లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించి ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

16న ఓయూలో జాబ్ మేళా

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12 : ఉస్మానియా యూనివర్సిటీలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో (మోడల్ కెరియర్ సెంటర్)లో ఈ నెల 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఓయూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి స్త్రీ, పురుషులు ఎవరైనా మేళాకు హాజరుకావచ్చని వివరించారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 7355469999 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువ క్రికెటర్‌ను అభినందించిన హెచ్‌సీఏ చీఫ్ జగన్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, ఫిబ్రవరి 12: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు ఎంపికైన భద్రాచలం యువ క్రికెటర్ త్రిషా పూజిత హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును మర్యాదపూర్వకంగా కలుసుకుంది. సోమవారం మాదాపూర్‌లోని తన కార్యాలయంలో త్రిషను జగన్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. హెచ్‌సీఏ తరపున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

14నుంచి పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 : జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ ఆలయం వార్షిక రథ మహోత్సవాలు ఫిబ్రవరి 14నుంచి 16వరకు కన్నుల పండువగా నిర్వహించనున్నామని ఆలయ ఈవో జి.శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14న తెల్లవారుజామున 3గంటల నుంచి ఆలయ ఫౌండర్ ట్రస్టీలు పి.ఇందిరాజనార్ధన్‌రెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులచే పెద్దమ్మతల్లికి అభిషేకం, విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, రుత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15న అభిషేకం, వేదపారాయణం, దేవీభాగవత చండీపారాయణం, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16న ఉదయ 8గంటలకు నవగ్రహ చండీ హోమం, బలిహరణం, రథ పూజ, పూర్ణాహుతి, కలశోద్వాసన తదితర పూజల అనంతరం సాయంత్రం శ్రీ పెద్దమ్మతల్లి ఉత్సవ మూర్తి రథం ఊరేగింపు నిర్వహించనున్నారు. నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరు కానున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస రాజు తెలిపారు.

బహుజన సాహిత్యంతోనే తెలుగు సాహిత్యానికి అస్తిత్వం

ప్రముఖ సాహితీవేత్త జూలూరి గౌరీశంకర్

ముషీరాబాద్/ జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 12 : బహుజన సాహిత్యం లేకపోతే తెలుగు సాహిత్యానికి అస్తిత్వమే లేదని ప్రముఖ సాహితీవేత్త, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో రవ్వా శ్రీహరి వేదికగా 'దళిత, బహుజన సాహిత్యం-దశ-దిశ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేడు తెలుగు భాషను రక్షించేది దళిత, బహుజన కవులేనన్నారు. ప్రముఖ కవి, రచయిత సతీష్ చందర్ మాట్లాడుతూ బుద్ధుడు, మార్క్స్, అంబేద్కర్.. ఈ ముగ్గురు తాత్వికమూర్తుల స్ఫూర్తితో సాహిత్యం రావాలని ఆకాంక్షించారు. ఈ సభకు డాక్టర్ కోయికోటేశ్వర రావు అధ్యక్షత వహించగా ఆచార్య సూర్యాధనుంజయ్, స్కై బాబా, డాక్టర్ జిలకర శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్.వాసు, కార్యవర్గ సభ్యులు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అతిథులను సత్కరించారు.

గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ డైరీని సోమవారం అసెంబ్లీ ఆవరణలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నరసయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి చక్రవర్తి , నాయకులు సురేశ్, శ్రవణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

13న వివేకానంద డే

కవాడిగూడ, ఫిబ్రవరి 12 : త్రికరణ శుద్ధితో చేసే నిరంతర, లోతైన సాధన ద్వారా ఆధ్యాత్మిక, వ్యవహారిక జీవితంలో అత్యుత్తమ ఫలితాలు పొందవచ్చని హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద తెలిపారు. రామకృష్ణమఠం స్వర్ణోత్సవాలలో భాగంగా నిర్వహించిన 'స్పిరిచ్యువల్ రిట్రీట్'లో ఆయన ప్రసంగించారు. సికింద్రాబాద్ మహబూబ్ కాలేజీలో ఫిబ్రవరి 13న 'వివేకానంద డే' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి నిత్యస్థానంద, పలువురు స్వాములు హైదరాబాద్ రామకృష్ణ మఠంలో ఉన్న అనుబంధాన్ని తమ ప్రసంగంలో గుర్తు చేసుకున్నారు.

రోజ్‌గార్ మేళాతో యువతకు ఉపాధి

కేంద్ర మంత్రి మురుగన్

జవహర్‌నగర్, ఫిబ్రవరి 12 : దేశాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ఎన్నో సంస్కరణలతోనే ప్రపంచ దేశాలతో భారత దేశం పోటీ పడుతుందని కేంద్ర మంత్రి మురుగన్ అన్నారు. హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీలో రోజ్‌గార్ మేళా-12 కేంద్ర సంస్థలకు చెందిన ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, గిరిజన, రెవెన్యూ, హోంశాఖ, ఉన్నత విద్యా, అణు ఇంధన, రక్షణ మంత్రిత్వ శాఖ, రైల్వే శాఖల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు నియామకమైన 259 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మురుగన్ మాట్లాడుతూ రోజ్‌గార్ మేళాతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హాయంలో 10లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రధాన మంత్రి మోదీ హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు 3లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, సోమవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా అనేక మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీ డైరెక్టర్ సునీల్ ఇమ్మానియేల్, డీఐజీ శ్రీనివాస్, అగ్నిమాపక శిక్షణ సంస్థ(ఎఫ్ఎస్ఐ) డీఐజీ, జేకే తివారి, అధికారులు, కొత్తగా నియామితులైన ఉద్యోగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి మురుగన్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్, ఫిబ్రవరి 12 : విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికిగాను అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, అర్హులైన వారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. 17న అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పొలిటికల్‌సైన్స్-1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-1 పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

ట్రాఫికర్ ఎందుకు?

- అడుగడుగునా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతోనే ప్రమాదాలు
- నిబంధనలు గాలికి, అతిక్రమించే వారిపై చర్యలు శూన్యం
- ట్రాఫిక్ చట్టాలపై పోలీసులు, ఆర్టీఏ అధికారులకు అవగాహన ఉందా?
- రోడ్‌క్రాఫ్ట్ అధ్యక్షుడు మాల్కం ఊల్ఫ్

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాల్కం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 12 : గ్రేటర్ హైదరాబాద్‌లో సామాన్యులు నడిచేందుకు సరైన ఫుట్‌పాత్‌లే లేవని రోడ్‌క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మాల్కం ఊల్ఫ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, ట్రాఫిక్ నిబంధనలు, పాలకుల విధానాలపై మాట్లాడారు. నగరంలో నామమాత్రంగా ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపై నడిచి అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇటీవల ఓ మహిళ రోడ్డు, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి హోటల్ నడిపిస్తుంటే పోలీసులు చర్యలు తీసుకోగానే చాలా మంది ట్విట్టర్, సోషల్ మీడియాలో ఆమెకు మద్దతుగా నిలిచారని, అయితే ఆ హోటల్ వల్ల ఎందరో రోడ్లపై నడిచి ప్రమాదాలకు గురవుతూ జీవితాలను కోల్పోతున్నారన్న విషయాన్ని గ్రహించడం లేదన్నారు. ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సైక్రియాటిస్ట్ డాక్టర్ కేశవ్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు భారతదేశంలోనే జరుగుతున్నాయని, పలు అధ్యయనాల్లో 80 శాతం డ్రైవర్ తప్పిదమేనని తేలిందన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో అసలు ట్రాఫిక్ నిబంధనలే పాటించడం లేదని, ఎవరూ హెల్మెట్లు పెట్టుకోరని, నంబర్ ప్లేట్ ఉండదని, రాంగ్ రూట్లలో యథేచ్ఛగా ప్రయాణిస్తున్నారని, ట్రాఫిక్ పోలీసులు సైతం పట్టించుకోవడంలేదని తెలిపారు. బ్రిగేడియర్ శ్రీరామ్ మాట్లాడుతూ రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు, యూటర్న్ వల్ల సమస్య పరిష్కారం కావడం లేదని, పలు కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా ఎందుకు ట్రాఫిక్ కంట్రోల్ చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. దశాబ్దాల క్రితం రూపొందించిన ట్రాఫిక్ చట్టాలనే ఇంకా అమలు చేస్తున్నారని, వీటిపై ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన లేనట్లు కనిపిస్తుందన్నారు. మన దేశంలో రాజకీయాలకు సంబంధించిన కేసులు త్వరగా కోర్టులో చర్చకు వస్తాయి.. కానీ ట్రాఫిక్‌కు సంబంధించిన కేసులు మాత్రం సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే ఉంటాయని తెలిపారు. ఇప్పటికైనా చట్టాల్లో సవరణలు చేయాలని, నిబంధనలను అతిక్రమించే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్‌క్రాఫ్ట్ సంస్థ కార్యదర్శి ఆదిశంకర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు హాజరైన భక్తులు, సంగీత కళాకారులు

ట్యాంక్‌బండ్‌పై రామదాసు జయంతి ఉత్సవాలు

కవాడిగూడ, ఫిబ్రవరి 12 : భద్రాచల శ్రీ రామదాసు 391 జయంతి వాగ్గేయకార ప్రయుక్త ఉత్సవాలను ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీ రామదాసు విగ్రహం వద్ద హరిహర ఫౌండేషన్ అధ్యక్షుడు మారగాని శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు దుర్గా బాయ్ దేశ్‌ముఖ్ సంగీత కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ బృందం, సరస్వతి సంగీత శిక్షణ నిలయం నిర్వాహకురాలు ప్రతిమా శశిధర్ శిష్యబృందం శ్రీ భక్తరామదాసు 'సంకీర్తనల' గోష్ఠి గానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్.బాలాచారి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అంతరంగిక కార్యదర్శి భాస్కర శర్మ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, డాక్టర్ రాందాస్, మాస పత్రిక చీఫ్ ఎడిటర్ ఎం.వెంకటేశ్వర్ రావు, భక్తులు, సంగీత కళాకారులు పాల్గొన్నారు.

రోగిని ఎలుకలు కొరికితే.. వైద్యులను సస్పెన్షన్ చేస్తారా?

- తీవ్రంగా ఖండిస్తున్నాం : ఐఎంఏ

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 12 : కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలోని ఐసీయూలో ఉన్న రోగిని ఎలుకలు కొరికిన ఘటనలో ఓ ప్రభుత్వ వైద్యాధికారిని సస్పెండ్ చేయడాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళి ప్రసాద్‌రావు, కార్యదర్శి డాక్టర్ విజయ్ రావు తీవ్రంగా ఖండించారు. రోగికి డిశ్చార్జీ అయ్యే వరకు చికిత్స అందించడమే తప్ప, ఎలుకలను వెతకడం తమ పనికాదని అన్నారు. వార్డులను శుభ్రంగా ఉంచాల్సింది శానిటరీ సిబ్బందని అన్నారు. ఐసీయూలో రోగిని ఎలుకలు కొరికినందుకు డాక్టర్‌ను సస్పెండ్ చేయడంపై ఐఎంఏ టీఎస్ పక్షాన నిరసన వ్యక్తం చేశారు. వైద్యుల సస్పెన్షన్‌ను రద్దు చేయకపోతే ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఏహెచ్‌ఏ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా డా.రమేశ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఎడోలసెంట్ హెల్త్ అకాడమి హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా నిలోఫర్ హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు దాంపురి సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా డా.రమేశ్‌బాబు మాట్లాడుతూ బాల్యం నుంచి యుక్తవయస్సులోకి అడుగు పెట్టే 10నుంచి 19సంవత్సరాల మధ్య వయస్సు పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేస్తామని, ముఖ్యంగా బాలికలు, యువతుల్లో తలెత్తుతున్న రక్తహీనత సమస్యను అధిగమించేందుకు యూనిసెఫ్‌తో కలిసి పనిచేస్తామన్నారు. పిల్లలకు న్యూట్రిషన్, మెంటల్ హెల్త్, సెక్యువల్ అండ్ రిప్రొడక్టివ్ హెల్త్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిలోఫర్ సూపరింటెండెంట్ డా.ఉషారాణి, ఏహెచ్‌ఏ సెక్రటరీ డా.సుచిత్ర, ట్రెజరర్ డా.చంద్రమోహన్, డా.సురేంద్రనాథ్, డా.నిర్మల, డా.అనిత తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారికి చేయూత

- బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : పీఎం విశ్వకర్మ స్కీమ్‌తో అంతరించి పోతున్న చేతి వృత్తుల వారికి చేయూత లభిస్తుందని, దీంతో చేతి వృత్తి దారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జిల్లాలోని బ్యాంకర్లు, అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు అర్హులైన విద్యార్థులకు రుణాలు అందించాలని అన్నారు. పీఎం స్కీమ్‌తో 18 రకాల చేతి వృత్తుల వారికి ఆర్థిక సహాయం అందుతుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి వార్షిక లక్ష్యం రూ.18,370 కోట్లు కాగా రూ.44,287 కోట్లు మంజూరు చేసి 241 శాతంతో లక్ష్యాన్ని అధిగమించారని అన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగు పర్చుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పరిశ్రమలు, డీఆర్‌డీఓ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం ఇతర ప్రాధ్యాన్యత రంగాలకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయించాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, కెనరా బ్యాంక్ డీజీఎం సంజయ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డీఓ గోమతి, నాబార్డు అధికారి రమేశ్, జీఎండీఐసీ రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి మేరి రేఖ, డీఆర్‌డీఓ పద్మజారాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో ఏఐ ఆధారిత చికిత్సపై చర్చ

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 12 : గాంధీ వైద్య కళాశాల అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ఆధారిత వైద్య చికిత్స పద్ధతుల గురించి అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో చర్చావేదిక నిర్వహించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల అలుమ్ని భవనంలో జరిగిన కార్యక్రమంలో చికాగోలోని ఇల్లినాయిస్ మెడికల్ యూనివర్సిటీ ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ వేమూరి మూర్తి మాట్లాడుతూ ఏఐ ఆధారిత క్లినికల్ బేస్డ్ చికిత్స పద్ధతులను వివరించారు. మల్టిపుల్ ఆరోగ్య సమస్యలతో ఉన్న రోగి వివరాలను ఏఐలో నమోదు చేశాక, సదరు రోగి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న సందర్భంలో అందించే చికిత్సలో ఏఐ వేగంగా సలహాలను అందిస్తుందన్నారు. చర్చలో పాల్గొన్న గాంధీ, ఉస్మానియా, నిమ్స్ దవాఖానలకు చెందిన పలువురు వైద్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. రాబోయే తరంలో ఏఐ చికిత్సా విధానం కీలకం కానున్నదని, అమెరికా లాంటి దేశాలలో ఇప్పటికే వినియోగంలో ఉందన్నారు. యువ డాక్టర్లు ఏఐ గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీ వైద్య కళాశాల అలుమ్ని అధ్యక్షుడు డాక్టర్ జీఆర్.లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఏఆర్.వెంకటరత్నం, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రతినిధి డెన్నిస్ మెకాలే (చికాగో), డాక్టర్ మహేశ్వర్ పర్వత్‌రెడ్డి, గాంధీ దవాఖాన అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ నాగార్జున చక్రవర్తి, గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

వైద్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతి

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 12 : కామారెడ్డి మెడికల్ కళాశాలలో వైద్యుల సస్పెన్షన్‌ను రద్దు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ రంగా అజ్మీరా, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రఘు, డాక్టర్ అబ్బయ్య అన్నారు. సోమవారం కోఠి డీఎంఈ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి మెడికల్ కాలేజీలో జరిగిన ఘటనను కొంత మంది కావాలనే వైరల్ చేశారని అన్నారు. వైద్యులు వైద్యం మాత్రమే అందిస్తారని, ఎలుకలు, పిల్లులను చూసుకోవాల్సిన బాధ్యత శానిటరీ, హౌజ్ కీపింగ్ వారిదని తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విన్నవించగా సస్పెన్షన్‌ను ఎత్తివేస్తానని హామీనిచ్చారని వారు పేర్కొన్నారు.